క్లుప్తంగా

'మేమంతా సిద్ధం' నమూనా చిత్రీకరణ



మేమంతా సిద్ధం బస్సు నమూనా

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 27 నుంచి ఇడుపులపాయ నుంచి ప్రారంభించే మేమంతా సిద్ధం యాత్ర నమూనాను ఏలూరుకు చెందిన సూక్ష్మ కళాకారుడు మేతర సురేష్‌బాబు చిత్రీకరించారు. అగ్గిపుల్లపై వైఎస్ జగన్ చిత్రాన్ని, అట్టముక్కలతో బస్సును రూపొందించారు. పార్టీపై ఉన్న అభిమానంతో మేమంతా సిద్ధం యాత్ర నమూనాను చిత్రీకరించినట్టు మేతర సురేష్‌బాబు తెలిపారు.

ఉపాధి పనులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం కార్యదర్శి రామకృష్ణ

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో విలీనం చేసిన ఏడు గ్రామ పంచాయతీల్లో పేదలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. స్థానిక పవరుపేటలోని సంఘ కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోణంగి, కొమడవోలు, చొదిమెళ్ల, శనివారపుపేట, వెంకటాపురం గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.రవి, సహాయ కార్యదర్శి ఎస్ మహంకాళీరావు, సత్తు కోటేశ్వరరావు, సాయి, చంటి, జె.గోపి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై కేసు నమోదు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని ఒక చేపల చెరువుకు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న యజమానిపై కేసు నమోదు చేసినట్లు ట్రాన్స్‌కో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని భీమడోలు మండలం లింగంపాడు గ్రామంలో బల్లె లీలాకుమార్ అనే వ్యక్తి తన చేపల చెరువుకు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయన్నారు. దీనిపై తమ విజిలెన్స్ అధికారులు, సిబ్బంది ఆకస్మిక తనిఖీ చేయగా, అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు నిర్ధారించారన్నారు. దీనిపై చెరువు యజమాని లీలా కుమార్‌పై విద్యుత్ చౌర్యం కేసు నమోదు చేసి రూ.2,50,745 అపరాధ రుసుము విధించడంతో పాటు రూ.30 వేలు జరిమానా విధించామని తెలిపారు. జిల్లాలో ఎవరైనా అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని రవికుమార్ హెచ్చరించారు.

వైభవంగా పవళింపు సేవ



గుండుగొలను మల్లేశ్వరస్వామి

భీమడోలు: గుండుగొలను, భీమడోలు శివాలయాల్లో నాలుగు రోజుల వార్షిక కల్యాణోత్సవాలు సోమవారం రాత్రితో వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా గుండుగొలను భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి, భీమడోలు పార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు పుష్పయోగోత్సవం కనులపండువగా నిర్వహించారు. స్వామి వార్లను వివిధ రకాల పువ్వులతో సుందరంగా అలంకరించి ముస్తాబు చేశారు. ఆలయ అర్చకులు లంకా శ్రీనివాస్, కాళ్లకూరి ఉమాశంకర్‌లు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పుష్పయోగం (పవళింపు) సేవ తంతును అర్చకులు ఘనంగా నిర్వహించారు. భక్తులు పూజల్లో పాల్గొన్నారు. వారికి తీర్థ ప్రసాదాలను అందించారు.

వైఎస్సార్ సీపీలో జోష్



వైఎస్సార్ సీపీలో చేరిన పోణంగిలోని టీడీపీ, జనసేన కార్యకర్తలు (ఫైల్)



వైఎస్సార్ సీపీలో చేరిన ఏలూరు ఏటిగట్టు ప్రాంత మహిళలు (ఫైల్)



వైఎస్సార్ సీపీలో చేరిన ముస్లిం మైనారిటీ టీడీపీ, జనసేన కార్యకర్తలు (ఫైల్)



వైఎస్సార్ సీపీలో చేరిన 2వ డివిజన్ ప్రాంత జనసేన కార్యకర్తలు (ఫైల్)

- సీఎం జగన్‌పై నమ్మకం
- ఎమ్మెల్యే నాని సమక్షంలో భారీగా చేరికలు
- విజయం ఖాయమంటున్న శ్రేణులు

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్ కొనసాగుతోంది. టీడీపీ, జనసేన పార్టీల నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ఆయా వర్గాల ప్రజలు సైతం తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఏలూరులో పార్టీ జోష్‌లో ఉండటం శుభ పరిణామమని శ్రేణులు చెబుతున్నారు. ఒకవైపు సీఎం జగనన్న సంక్షేమ పాలన, మరోవైపు ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నానిపై అభిమానంతో వందల సంఖ్యలో టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకుంటున్నారు.

నూతనోత్సాహం

ఏలూరు నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పని చేస్తున్నారు. గడపగడపకూ వెళుతూ ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కారానికి మొన్నటి వరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తాజాగా ముఖ్యకార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటుచేస్తూ పార్టీ కేడర్‌లో ఎమ్మెల్యే నాని నూతన ఉత్సాహాన్ని నింపుతున్నారు. పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేస్తూ సార్వత్రిక ఎన్నికల రణరంగానికి సంసిద్ధం చేస్తున్నారు. ఏలూరులోని పోణంగి ప్రాంతానికి చెందిన గేదెల సూర్యప్రకాష్, దారపు తేజ ఆధ్వర్యంలో 200 మందికిపైగా టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. రెండో డివిజన్‌లో జనసేన, టీడీపీ కార్యకర్తలు, ఏటిగట్టు ప్రాంతానికి చెందిన మహిళలు, ఏలూరు వన్‌టౌన్ కత్తేపువీధి ప్రాంతానికి చెందిన ముస్లిం మైనార్టీ యువత, టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరడంతో పార్టీ గెలుపుపై అంచనాలు పెరిగాయి.

గెలుపుపై ధీమా

ఏలూరులో మరోసారి చరిత్ర సృష్టించేందుకు వైఎస్సార్ సీపీ సిద్ధమైంది. మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా పని చేసి తనదైన శైలిలో ప్రజలకు సేవలందించిన ఎమ్మెల్యే ఆళ్ల నాని మరోసారి విజయం దిశగా దూసుకుపోతున్నారు. ఏలూరు నియోజకవర్గంలో తిరుగులేని నాయకుడిగా ప్రజల్లో పేరు తెచ్చుకున్న ఎమ్మెల్యే నానిపై విశ్వాసం ప్రదర్శిస్తూ టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన వందలాది మంది కార్యకర్తలు, నాయకులు నానితో నడిచేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్ల కాలంలో ఏలూరు నియోజకవర్గంలో భారీఎత్తున సంక్షేమ పథకాలను అందించడంతో పాటు వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడంపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికల్లో విజయం సాధించడం ఖాయమని పార్టీ కేడర్ ధీమా వ్యక్తం చేస్తోంది.

మాదిగలంతా సీఎం జగన్‌తోనే

పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శి జాన్‌గురునాథ్



మున్నుల జాన్‌గురునాథ్

ఏలూరు టౌన్: హోంమంత్రి పదవి, ఇతర కీలక మంత్రి పదవులు మాదిగలకు ఇచ్చి గౌరవించిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మాదిగ సామాజికవర్గం అంతా జగనన్నకే మద్దతుగా నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఏలూరు కోఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్‌గురునాథ్ అన్నారు. ఏలూరులో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మంద కృష్ణమాదిగ చెప్పినట్టు చేసేందుకు మాదిగజాతి సిద్ధంగా లేదన్నారు. మాదిగజాతిని అత్యంత దారుణంగా మోసం చేసిన చంద్రబాబును మరోసారి నమ్మితే నట్టేట ముంచేస్తాడని విమర్శించారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు మాదిగలకు చేసిందేమిటో చెప్పగలవా కృష్ణమాదిగ అని ఆయన ప్రశ్నించారు. తాను పెద్దమాదిగ అవుతానంటూ మోసం చేసిన చంద్రబాబును మరోసారి మోయటానికి ఎంత ప్యాకేజీ తీసుకున్నావో చెప్పాలని మంద కృష్ణమాదిగను డిమాండ్ చేశారు. ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి అధికారం దక్కటం కలలో కూడా జరగదన్నారు. వారు ఎన్ని కుట్రలు చేసినా, దళితజాతి వారిని ఓడిస్తుందని వివరించారు. ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అంటూ చంద్రబాబు అంటే.. అప్పుడు కృష్ణమాదిగ ఎక్కడ ఉన్నాడని, కృష్ణమాదిగ వెనుక మాదిగ జాతి మొత్తం ఉందనే భ్రమలో ఉంటే దానినుంచి బయటకు రావాలని జాన్‌గురునాథ్ హితవుపలికారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ విజయం సాధిస్తుందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ అనైతిక పొత్తును ప్రజలు హర్షించటం లేదన్నారు. ఏలూరు జిల్లాలో ఏడు అసెంబ్లీ సీట్లు, ఒక ఎంపీ సీటును కైవసం చేసుకోవటంతో పాటు, రాష్ట్రంలో 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ జెండా ఎగురబోతుందని ఆయన వివరించారు.

వైఎస్సార్ సీపీ హయాంలో బీసీలకు పెద్దపీట



జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటాపద్మశ్రీ

పెదపాడు: బీసీలకు పెద్దపీట వేసింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. ఇంతవరకు 11 స్థానాలు కేటాయించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం కొప్పుల వెలమ సామాజిక వర్గానికి చెందిన బూడి ముత్యాలనాయుడుకు ఎంపీ స్థానాన్ని కేటాయించడంతో 12 ఎంపీ స్థానాలు బీసీలకు ఇచ్చినట్టైందని చెప్పారు. చంద్రబాబు బీసీలకు అండగా ఉంటానని మాటల్లో చెబితే జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు పెద్దపీట వేస్తానని చేసి చూపించారని వివరించారు. బీసీలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి 48 అసెంబ్లీ స్థానాలు 12 ఎంపీ స్థానాలు కేటాయించి బ్యాక్‌బోన్ క్లాస్‌గా మార్చారని తెలిపారు. టీడీపీ నలుగురికి మాత్రమే టిక్కెట్లు ఇచ్చిందని గుర్తుచేశారు. చంద్రబాబుకు అధికార దాహంతో, తాపత్రయంతో సర్వశక్తులు వడ్డుతున్నారని చెప్పారు. ఏనాడైనా చంద్రబాబు ఒక్క బీసీ నాయకుడిని రాజ్యసభకు పంపించారా అంటూ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ముగ్గురిని పంపించారని వివరించారు. రానున్న ఎన్నికల్లో పేదలు సైతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు కాబోతున్నారని చెప్పారు.

పది పరీక్షలకు 4,700 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నియోజకవర్గంలో పదో తరగతి జీవశాస్త్రం పరీక్ష మంగళవారం ప్రశాంతంగా నిర్వహించారు. మొత్తం 20 కేంద్రాల్లో 4,310 మంది విద్యార్థులకు 4,237 మంది హాజరుకాగా 82 మంది గైర్హాజరయ్యారు. ఫెయిలై ప్రైవేట్ విద్యార్థులు 695 మందికి 463 మంది హాజరుకాగా 244 మంది గైర్హాజరయ్యారు. ఏలూరు రూరల్ చాటపర్రు హైస్కూల్‌లో 244 మందికి 221 మంది, ప్రైవేట్ విద్యార్థులు 75 మందికి 54, సత్రంపాడు హైస్కూల్‌లో 290 మందికి 285, శనివారపుపేట హైస్కూల్‌లో 237 మందికి 230, ప్రైవేట్ విద్యార్థులు 68 మందికి 43 మంది, గవరవరం శ్రీచైతన్య స్కూల్‌లో ప్రైవేట్ విద్యార్థులు 143 మందికి 93 మంది హాజరయ్యారు. ఏలూరు అర్బన్ సెయింట్ థెరిస్సా పాఠశాలలో 300 మందికి 296 మంది, కేపీడీటీ హైస్కూల్‌లో 240 మందికి 234, సుబ్బమ్మ దేవి హైస్కూల్‌లో 300 మందికి 295, సురేష్ చంద్ర బహుగుణ పోలీస్ స్కూల్‌లో 300 మందికి 298, కేకేఆర్ గౌతం స్కూల్‌లో 236 మందికి 230, ప్రైవేట్ విద్యార్థులు 42 మందికి 32, రవీంద్రభారతి స్కూల్‌లో 193 మందికి 188, న్యూ జనరేషన్ ఐకాన్ యూపీ స్కూల్‌లో ప్రైవేట్ విద్యార్థులు 123 మందికి 68, ఏఆర్‌డీజీకే హైస్కూల్‌లో 230 మందికి 229, కస్తూరిబా బాలికోన్నత పాఠశాలలో 340 మందికి 338 మంది హాజరయ్యారు. గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో 320 మందికి 315, తూర్పువీధి శ్రీకృష్ణ దేవరాయ మున్సిపల్ హైస్కూల్‌లో 290 మందికి 289, జేఎంజే ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 240 మందికి 239, అమలోద్భవి హైస్కూల్‌లో 340 మందికి 339, నారాయణ హైస్కూల్‌లో 204 మందికి 204, బాలగంగాధర్ తిలక్ స్కూల్‌లో ప్రైవేట్ విద్యార్థులు 125 మందికి 92, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ప్రైవేట్ విద్యార్థులు 110 మందికి 71 మంది హాజరయ్యారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత జీవనం



భీమడోలు శివాలయంలో స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వాసుబాబు



అన్న సమారాధనలో ప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

భీమడోలు: ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత జీవనం సిద్ధిస్తుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలులో అతిపురాతన ఆలయం పార్వతీ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వాసుబాబు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దిన అభివృద్ధి కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనలో వాసుబాబు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను వడ్డించారు. వేలాది మంది భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. తొలుత ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు వాసుబాబుకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ నిర్వాహకులు చింతా శ్రీరామచంద్రమూర్తి, ఆర్బీకేల చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేగంగా ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మాణం

పెదపాడు: ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మాణ పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ తెలిపారు. మండలంలోని తోటగూడెం గ్రామంలో ఓహెచ్ఆర్ ట్యాంకు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కాంట్రాక్టరుకు పలు సూచనలు సలహాలు అందించారు. త్వరితగతిన నిర్మాణ పనులు చేయాలని తెలిపారు. మూడు నెలల్లో ట్యాంకు నిర్మించి అప్పగించాలని సూచించారు.

భారీ అన్న సమారాధన

పెదపాడు: మండలంలోని అప్పనవీడు అభయాంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం 200 మందికి లక్ష్మీపురం గ్రామానికి చెందిన మేకా నరేంద్ర రాధ దంపతుల ఆర్థిక సాయంతో అన్నదానం చేశారు. స్థానికులు మట్టా శ్రీను దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు.

చెక్‌పోస్ట్‌ల వద్ద తనిఖీలు ముమ్మరం



లింగగూడెం సమీపంలో వాహన తనిఖీ చేస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి అద్దయ్య

చింతలపూడి: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో అధికారులు ప్రతిరోజు వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. ముఖ్యంగా ఆంధ్ర, తెలంగాణ బోర్డర్ చెక్‌పోస్ట్‌ల వద్ద అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. చెక్‌పోస్టుల వద్ద తెలంగాణ నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మంగళవారం చింతలపూడి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె అద్దయ్య లింగగూడెం, అల్లిపల్లి చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తెలంగాణ నుంచి వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం, నిబంధనలకు విరుద్ధంగా అధిక మొత్తంలో డబ్బు తరలిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగదు, బంగారం ఇతర విలువైన వస్తువులు తమ వాహనాల్లో తీసుకు వెళితే అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని వాహన దారులకు సూచించారు. ప్రజలు ఎన్నికల నిబంధనలు పాటించాలని, విధి నిర్వహణలో ఉన్న అధికారులు, సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీల ప్రచారంలో పాల్గొనకూడదని హెచ్చరించారు. ఆయన వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

అప్పనవీడులో నేను సిద్ధం.. మా ఊరు సిద్ధం



పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అప్పన ప్రసాద్

పెదపాడు : అర్హులందరికీ ఇళ్ల స్థలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ కొనియాడారు. పెదపాడు మండలం అప్పనవీడులో నేను సిద్ధం.. మా ఊరు సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అప్పనవీడు గ్రామంలో 25 ఏళ్లుగా ఏ నాయకుడు సెంటు స్థలం ఎవ్వరికీ ఇవ్వలేదని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ సొంతిల్లు ఇవ్వాలనే ఆలోచన చేశారని తెలిపారు. అప్పనవీడులో 10 ఎకరాలు కొని పేదలకు ఇళ్ల స్థలాలు అందించారని చెప్పారు. ఆన్‌లైన్ చేసుకున్న వారందరికీ ఈ ఎన్నికల అనంతరం స్థలాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. పేదలకు సొంతింటి కల నెరవేరిందన్నారు. జగనన్న రెండోసారి ముఖ్యమంత్రి చేసేందుకు ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అప్పన పద్మావతి గ్రామ సర్పంచ్ చిన్నాల ఝాన్సీ, ఎంపీటీసీ బుద్దే రామసీత స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు అభినందనలు



బృంద సభ్యులకు అభినందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణానికి చెందిన ప్రజాకళాకారులు, జానపద కళారత్న ఎల్ఆర్‌కృష్ణబాబు బృంద సభ్యులకు మంగళవారం నూకాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. కృష్ణబాబు పర్యవేక్షణలో కోలాటం నాట్యగురువు జె.సాయిభరత్ ఆధ్వర్యంలో బండి మల్లిక, సావిత్రిబాయి పూలే మహిళా కోలాట బృందం, 111 మంది భక్తులతో తమిళనాడు రాష్ట్రం అరుణాచలంలో అరుణగిరి చేటూట 23 గంటల పాటు నృత్య ప్రదర్శన చేస్తూ ప్రదక్షిణ పూర్తి చేశారు. అరుదైన ఈ ప్రదర్శనను గుర్తిస్తూ తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ (తానా), బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, భారత్ టాలెంట్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వారు గుర్తించి, అవార్డ్స్ ఇచ్చి కళాకారులను సత్కరించారు. ఎల్ఆర్.కృష్ణబాబు బృందాన్ని మంగళవారం పట్టణంలోని నూకాలమ్మ ఆలయంలో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజాన సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, నూకాంబిక సేవా బృందం సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	19
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	37
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	15

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	14
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	19
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	23
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	17
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	15
ఏలూరు –తిరుపతి	16.00	4830	32

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.80 వేలు విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు మంగళవారం రూ.80 వేలను విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన చిత్తజల్లు ఆనాడు అనే భక్తుడు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

సారా విక్రయాలపై ఉక్కుపాదం మోపండి

బుట్టాయగూడెం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామాల్లో నాటు సారా విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని ఐటీడీఏ పీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ అన్నారు. కేఆర్‌పురం ఐటీడీఏ మీటింగ్ హాల్‌లో మంగళవారం రెవెన్యూ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీస్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నాటు సారా క్రయవిక్రయాలు జరగకుండా నిరోధించాలన్నారు. అదేవిధంగా సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల్లో నిఘా పటిష్టంగా అమలు చేయాలన్నారు. అంతర రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి అక్రమ మద్యం, సారాయి, మాదకద్రవ్యాలు ఏపీలోకి రాకుండా చెక్ పోస్ట్‌ల వద్ద నిరంతరం వాహనాల తనిఖీలు జరిగేలా చూడాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా అన్ని శాఖల అధికారులు సమష్టిగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అసిస్టెంట్ కమిషనర్ (విజిలెన్స్), స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి(పోలవరం), తహసీల్దార్‌లు, తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' ఫిర్యాదుపై విచారణ

టి.నరసాపురం: స్పందనలో వచ్చిన ఫిర్యాదుపై మంగళవారం అధికారులు విచారణ నిర్వహించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో టి.నరసాపురానికి చెందిన డి.విల్సన్‌బాబు సొసైటీ వాటర్ ప్లాంట్‌కు సంబంధించి ఫిర్యాదు చేశారు. టి.నరసాపురం సొసైటీ వాటర్ ప్లాంట్ మూయడానికి కారణాలు, ప్లాంట్‌లో పని చేసే సిబ్బందికి న్యాయం చేయాలని, సొసైటీలో విలువైన సామగ్రి చోరీకి బాధ్యులెవరని, నష్టాన్ని వసూలు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ఫిర్యాదుపై జిల్లా కోపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మోహన్ బాబు మంగళవారం విచారణ నిర్వహించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ మాట్లాడుతూ స్పందన ఫిర్యాదులో పేర్కొన్న ప్రతి అంశాన్ని క్షేత్రస్థాయిలో విచారించామని, నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

వల్లూరులో వైద్య సేవలు



వల్లూరులో కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు

గణపవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి కిరణ్మయి అన్నారు. మంగళవారం గణపవరం మండలం వల్లూరులో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 280 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. జనరల్ మెడిసిన్ కె.సుధాకర్, ఆర్థోపెడిక్ సర్జన్ రాఘవేంద్ర, కంటి వైద్య నిపుణులు శ్రీనివాస్, సీహెచ్ఓ జాలాది విల్సన్ తదితరులు వైద్యసేవలు అందించారు.